పత్రికా ప్రకటన కాకినాడ, డిశంబర్ 7, 2018.

దేశ రక్షణ కు అహార్నిశలు శ్రమించి ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ల కుటుంబాలను ఆదుకోవల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని, ఇందుకోసం పతాక నిధికి ప్రజలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు విరాళాలు అందించాలని జిల్లా కలక్టరు కార్తికేయ మిశ్రా కోరారు. శుక్రవారంనాడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కూడలిలోగల అమర జవాన్ల మెమోరియల్ స్థూపం వద్ద పుష్పగుచ్ఛం వుంచి వీర మరణం పొందిన అమర జవాన్లకు కలక్టరు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలక్టరు కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో సైనికులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా దేశ రక్షణకు పని చేస్తారని వారి త్యాగం ఎంతైనా కొనియాడదగినదన్నారు. తొలుత కలక్టరు విరాళాన్ని అందజేసి సాయుధ పతాక దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. జిల్లాలోని సైనికులు, మాజీ సైనికులు, అమర జవాన్ల కుటుంబ సభ్యులకు సాయుద దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు కలక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ ఎన్‌సిఎస్ నాయుడు మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో రక్షణ కొరకు పనిచేయుచున్న సైనికుల సేవలు ఎంతైనా కొనియాడదగినవన్నారు. కుటుంబాలను విడిచిపెట్టి దేశ రక్షణ కొరకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేస్తారని, వారి కుటుంబాలను ఆదుకోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. మెమోరియల్ స్థూపం వద్ద పుష్పగుచ్ఛం వుంచి అమర జవాన్లకు నివాళులు అర్పించారు. కాకినాడ విసీహెచ్ఎస్, ఓఐసి, కమాండర్ ఎస్.కె.ప్రదాన్ అమర జవాన్ల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం వుంచి నివాళులు అర్పించారు. పతాక నిధికి విరాళాలు అందించేవారు డైరక్టర్ సైనిక సంక్షేమ శాఖ విజయవాడ వారి అక్కౌంటు నెం.33881128795 కు నేరుగా జమ చేయవలసిందిగానూ, లేదా వారి పేరున చెక్కు డ్రాఫ్టలను తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాకు పంపవలసిందిగా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం కోరారు. పతాక నిధికి అందించే విరాళాలకు ఆదాయపన్ను రాయితీ లభించునని ఆయన తెలిపారు. అమర జవాన్ల సహాయ నిధికి ఎక్స్ సర్వీస్‌మెన్ హెల్ప్‌లైన్ కాకినాడ అధ్యక్షులు అడపా శంకర్, సెక్రటరీ ఎ.సూర్యరావు, సభ్యులు యాభైవేల రూపాయల చెక్కును అందజేసారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎ.శైలజ, థర్డ్ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి ఆఫీసర్ ప్రమీలరాణి, మాజీ సైనిక సంఘం కాకినాడ అధ్యక్షులు ఎ.శంకర్, బి.విక్టర్, రాజమహేంద్రవరం, అమలాపురం, పిఠాపురం మాజీ సైనిక సంఘం అధ్యక్షులు, ఎన్‌సిసి సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖ చే జారీ)